


మొయినాబాద్ పరిధి అజీజ్‌నగర్ అప్పా జంక్షన్ వద్ద పట్టుబడిన కారు



కారు డిక్కీలో దొరికిన డబ్బులు ఉన్న రెండు సూట్‌కేసులు



కారులో దొరికిన డబ్బుల బ్యాగు



కట్టలు కట్టలుగా పోలీసులకు పట్టుబడిన డబ్బులు

# పైసలున్నోళ్లకే కాంగ్రెస్ పట్టం

- డబ్బు సంచులు తెచ్చినోళ్లకు టికెట్లు.. సంపదలేనోళ్లందరికీ మొండి 'చేయి'
- దీనికి వనపర్తి చిన్నారెడ్డే ఉదాహరణ
- డబ్బు రాజకీయం చేసేందుకే సంపన్నులకు చోటు కల్పిస్తున్న వైనం
- అధికారుల తనిఖీల్లో పట్టుబడుతున్న కాంగ్రెస్‌కు చెందిన కట్టల పాములు
- తెలంగాణను కమ్మేస్తున్న కర్ణాటక రాష్ట్ర నేతల సొమ్ములు

*చిన్నారెడ్డి:* ఆయన ప్రాణం, జీవితం మొత్తం కాంగ్రెస్ పార్టీనే. పార్టీలో ఆయన అత్యంత సీనియర్ నేత. అలాంటి వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ వనపర్తి టికెట్ ఇవ్వలేదు. ఆయన స్థానంలో నిన్న మొన్న పార్టీలో చేరిన మేఘారెడ్డికి టికెట్ ఇచ్చింది. ఇందుకు ఒకే ఒక్క కారణం.. డబ్బు. ఆ డబ్బు చిన్నారెడ్డి వద్ద లేదు... మేఘారెడ్డి వద్ద ఉంది.

*నందికంటి శ్రీధర్:* పార్టీ కోసం దశాబ్దాలుగా పని చేస్తున్నారు. అయినా ఆయన్ను కాదని రాత్రికి రాత్రి పార్టీలో చేరిన మైనంపల్లి హన్మంతరావుకు మల్కాజిగిరి టికెట్ ఇచ్చింది. ఇందుకు కారణం డబ్బు. శ్రీధర్ వద్ద డబ్బు లేదు.. మైనంపల్లి వద్ద ఉంది.

*సాజిద్‌ఖాన్, గండ్రత్ సుజాత* ఈ ఇద్దరూ కాంగ్రెస్‌ను నమ్ముకొని కొన్నేండ్లుగా రాజకీయం చేస్తున్నారు. కానీ ఆదిలాబాద్ టికెట్‌ను ఈ ఇద్దరికీ కాదని కంది శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఇచ్చింది. ఇందుకు కారణం.. ఆ ఇద్దరి వద్ద డబ్బు లేకపోవడం, శ్రీనివాస్‌రెడ్డి సంపన్నుడు కావడం.

*ఈ మూడు ఉదాహరణలే కాదు... కాంగ్రెస్‌లో పార్టీలో పైసలున్నోళ్లకే టికెట్ ఇచ్చారనడానికి దాదాపు ప్రతి నియోజక వర్గమూ ఒక ఉదాహరణగా నిలుస్తుంది.*

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో కాసులున్నోళ్లకే రెడ్ కార్పెట్ పరిచారు. అవసరమైతే ఓటర్లను డబ్బుతో ప్రలోభపెట్టి గెలవాలనుకున్న కాంగ్రెస్.. ఆ ప్రణాళిక మేరకే డబ్బున్నోళ్లకు టికెట్లు ఇచ్చిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ మేరకే బడా వ్యాపారవేత్తలుగా పేరున్న చాలా మందిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నట్టు తెలుస్తున్నది. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మొదలుకొని మొన్నటి వివేక్ వెంకటస్వామి వరకు సుమారు 30మందికిపైగా డబ్బున్న నేతలు పార్టీలో చేరారు. ఈ విధంగా కాంగ్రెస్‌లో కాసుల రాజకీయం నడుస్తుందని, పైసలున్నోళ్లకే పట్టం కడుతున్నారనే విమర్శలున్నాయి. టికెట్లైనా, చేరికలైనా పైసలే ప్రామాణికంగా మారాయనే అభిప్రాయాలున్నాయి. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తూ ప్రజల్లో ఉన్న నేతల్ని కాదని, కట్టల మూటలు పట్టుకొని వచ్చిన పారాచ్యూట్ నేతలకు అప్పనంగా టికెట్లు కేటాయించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

## పైసలు లేనోళ్లు పక్కకే

ఇటీవల కాలంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మారిపోయిందని సొంత పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు. గతంలో పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చి, టికెట్లు ఇచ్చేవారని, కానీ ఇప్పుడు పైసలున్నోళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైసలు లేనోళ్లను పక్కకు పెట్టేస్తున్నారని మండిపడుతున్నారు. ఇందుకు చిన్నారెడ్డి, కంతారెడ్డి తిరుపతిరెడ్డి, నందికంటి శ్రీధర్, మానవతారాయ్, బల్మూరి వెంకట్, సాజిద్ ఖాన్, పాల్వాయి స్రవంతి వంటి నేతల్ని ఉదాహరణగా చూపిస్తున్నారు. మరికొంత నేతలు కాంగ్రెస్‌లో ఈ కాసుల రాజకీయం చూడలేక, భరించలేక ఇతర పార్టీల్లోకి వెళ్లిపోయారు.

## చేరినవారంతా 'బడా' నేతలే..

*కాంగ్రెస్ పార్టీలో ఇటీవల చేరిన నేతల జాబితాను పరిశీలిస్తే... అందరూ సంపన్నులే నన్న సంగతి తెలుస్తుంది. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, సరితా, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఆరెంజ్ సునీల్ రెడ్డి, కంది శ్రీనివాస్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, వివేక్ వెంకటస్వామి ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మందే ఉన్నారు. కొత్తగా చేరిన వీరందరికీ ఈ ఎన్నికల్లో పార్టీ టికెట్లు దక్కాయి.*

## కట్టలుకట్టలుగా బయటపడుతున్న కోట్ల రూపాయలు

ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని, అవసరమైతే డబ్బు రాజకీయం చేయాలన్న ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ సంపన్నులకు ఆశ్రయమిచ్చిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఈ ఎన్నికల్లో డబ్బుతో ఓటర్లను కొనుగోలు చేసేందుకు కుట్రలు చేస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలకు బలం చేకూర్చేలా ఇటీవలి తనిఖీల్లో కాంగ్రెస్ నేతలవిగా చెప్తున్న డబ్బులు పెద్ద మొత్తంలో పట్టుబడుతున్నాయి. నిన్నటికి నిన్న పోలీసుల తనిఖీల్లో రూ. 7.5 కోట్లు పట్టుబడ్డాయి. ఈ డబ్బు మొత్తం ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డివిగా చెప్పుకుంటున్నారు. రామంతాపూర్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.50 లక్షలు మరో కాంగ్రెస్ నేత జీ వివేక్‌కు చెందినవిగా అనుమానిస్తున్నారు. తాజాగా వివేక్ కంపెనీ నుంచి మరో కంపెనీకి బదిలీ అయిన రూ.8 కోట్లను పోలీసులు జప్తు చేశారు. ఇవి కూడా ఓటర్లను ప్రలోభపెట్టేందుకేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడి నేతల డబ్బులు చాలవన్నట్టు కర్ణాటక కాంగ్రెస్ నుంచి కూడా తెలంగాణ ఎన్నికలకు పెద్ద ఎత్తున డబ్బు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెల క్రితం కర్ణాటకలో ఐటీ అధికారుల తనిఖీల్లో సుమారు రూ. 100 కోట్ల వరకు డబ్బు దొరికిన సంగతి తెలిసిందే. కర్ణాటక కాంగ్రెస్ నేతకు చెందిన ఈ డబ్బు తెలంగాణకు తరలించేందుకే సిద్ధం చేసినట్టు సమాచారం.

## కాంగ్రెస్ కట్టల పాములు

మొదటిపేజీ తరువాయి...

హెచ్‌డీఎఫ్‌సీ బ్రాంచ్‌లోని విశాఖ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఒక ఖాతా నుంచి బషీర్‌బాగ్‌లోని ఐడీబీఐ బ్యాంకుశాఖలోని విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతాలోకి (ఖాతా నంబర్ 0142003072600) రూ.8 కోట్ల నగదు బదిలీ అయినట్టు ఈసీ అధికారులు సమాచారం అందించింది. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆదేశాలతో సైఫాబాద్ పోలీసులు దీనిపై విచారణ చేపట్టారు. ఆ ఖాతాలో జమైన అనుమానాస్పద రూ.8 కోట్ల నగదును ఫ్రీజ్ చేయాలని బ్యాంకు మేనేజర్‌కు ఈసీ అధికారులు లేఖ రాశారు. దాంతో బ్యాంకు అధికారులు ఫ్రీజ్ చేశారు. తాజాగా ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందినదిగా భావిస్తున్న రూ.7.5 కోట్ల నగదును సైబరాబాద్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే.

## 625.79 కోట్ల సొత్తు సీజ్

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కమిషన్ మార్గనిర్దేశనంలో రాష్ట్ర పోలీసులు 24/7 విధులు నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 9వ తేదీ నుంచి ఆదివారం వరకు పోలీసుల స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ 400 కోట్లకు చేరింది. వీటిల్లో రూ.171 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.187 కోట్ల నగదు, రూ.17 కోట్ల డ్రగ్స్, రూ.9 కోట్ల మద్యం, రూ.16 కోట్ల ఇతర ఉచితాలను స్వాధీనం చేసుకున్నారు. 2018 ఎన్నికల్లో రూ.120 కోట్లకుపైగా నగదు, బంగారు, డ్రగ్స్, మద్యం పట్టుబడింది. తాజా ఎన్నికల సందర్భంగా ఆదివారం వరకు స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.625.79 కోట్లకు చేరింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు రూ.22.46 కోట్ల విలువైన మద్యం, నగదు, బంగారు ఆభరణాలు, ఉచితాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# 7.5 కోట్లపై కదులుతున్న డొంక

- శ్రీనిధి చైర్మన్ ఇంటి నుంచి డబ్బు వచ్చినట్టు పోలీసుల నిర్ధారణ
- ఆయన ఇండ్లు, ఆఫీసుల్లో సోదాలు
- 12 లక్షల నగదు సీజ్.. కీలక పత్రాలు స్వాధీనం
- కాంగ్రెస్ నాయకుడు పొంగులేటికి బిగుస్తున్న ఉచ్చు

హైదరాబాద్/సిటీబ్యూరో/మొయినాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఖమ్మం కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వర్గీయులదిగా భావిస్తున్న రూ.7.5 కోట్ల నగదు శనివారం అజీజ్‌నగర్‌లో పట్టుబడిన కేసులో సైబరాబాద్ పోలీసులు లోతుగా దర్యాప్తు జరుపుతున్నారు. ఆరు కార్లలో నగదును తరలిస్తూ చిక్కిన 10 మందికి పోలీసులు నోటీసులు జారీచేశారు. ఇప్పటికే వారికి సంబంధించిన ఆధారాలు సేకరించిన పోలీసులు.. వారి ఫోన్ కాల్‌డాటాపై ఆరా తీస్తున్నారు. నిందితుల ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లను సీజ్ చేశారు. డబ్బును మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ రెవెన్యూలో ఉన్న శ్రీనిధి ఇంటర్నేషనల్ చైర్మన్ కేటీ మహి ఇంట్లో నుంచి తీసుకొచ్చారని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఐటీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు రంగంలోకి దిగారు.

## ముగిసిన సోదాలు

శ్రీనిధి ఇంటర్నేషనల్ చైర్మన్, ఇంటి యజమాని కేటీ మహి లేకపోవడంతో ఆయన భార్యకు నోటీసులు ఇచ్చి.. నివాసంలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. 20 మంది ఐటీ అధికారుల బృందం శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు సోదాలు జరిపింది. కేటీ మహి ఇంటితోపాటు ఆయనకు చెందిన పుట్‌బాల్, క్రికెట్ అకాడమీ, కార్యాలయాల్లో సైతం అధికారులు సోదాలు చేశారు. ఇంట్లో రూ.12 లక్షల నగదు, కీలక పత్రాలను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లో కొన్ని లాకర్లు ఓపెన్ కాకపోవడంతో ఐటీ అధికారులు వాటిని సీజ్ చేశారు. పట్టుబడిన డబ్బును కోర్టులో డిపాజిట్ చేయనున్నట్టు పోలీసులు తెలిపారు. కేటీ మహి ఇంట్లో నుంచి అక్రమంగా తరలించిన డబ్బులు ఎక్కడివి, ఎక్కడి నుంచి వచ్చాయి, ఎవరి కోసం వెళ్తున్నాయి, దీని వెనకాల ఉన్న రాజకీయ శక్తులేంటి తదితర వివరాల కోసం పోలీసులు కూపీ లాగుతున్నారు. పూర్తి విచారణ తరువాత వివరాలు వెల్లడిస్తామని పోలీసు అధికారులు వెల్లడించారు.

## బీఆర్ఎస్ నాయకులపై బీజేపీ కార్యకర్తల దాడి

డిచ్‌పల్లి, నవంబర్ 19: ప్రచారానికి వెళ్లిన బీఆర్ఎస్ నేతలపై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడంతో డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం డిచ్‌పల్లి మండలం అమృతాపూర్‌లో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రచారం చేస్తుండగా కొందరు బీజేపీ కార్యకర్తలు వచ్చి బీఆర్ఎస్ నేతలతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే తమపై దాడికి యత్నించారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాళ్ల సురేశ్, విజయ్, రమణ, బాలయ్యతోపాటు మరో ఆరుగురు తమపై దాడికి యత్నించగా.. తన చేతివేలికి గాయమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ కృష్ణ, ఎస్సై మహేశ్ అమృతాపూర్‌కు వెళ్లి వివరాలు సేకరించారు. దాడికి పాల్పడిన సురేశ్, రమణ, బాలయ్య, విజయ్, శ్రీధర్, అర్వింద్‌తోపాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



భీంపూర్‌లో బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్‌తో మాట్లాడుతున్న మహారాష్ట్ర కూలీలు

# మాకు తెలంగాణలోనే ఉండాలని ఉంది

- ఇక్కడి పథకాలు బాగున్నాయి
- బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థితో మహారాష్ట్ర కూలీల ముచ్చట

ఆదిలాబాద్, నవంబర్ 19(నమస్తే తెలంగాణ): బోథ్ నియోజకర్గం బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా.. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో పత్తిచేలో పనిచేస్తున్న మహారాష్ట్ర కూలీలను కలిశారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర కూలీలు అనిల్ జాదవ్‌తో తమ గోడు వెల్లబోసుకున్నారు. 'తెలంగాణలో సంక్షేమ పథకాలు అద్భుతంగా ఉన్నాయి. మా మహారాష్ట్రలో ఉపాధి లేక సరిహద్దులో ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాకు వచ్చి కూలి పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నం. మా రాష్ట్రంలో కూలి పనులు దొరకక పస్తులు ఉండాల్సిన దుస్థితి ఉంది. మా దగ్గర రైతుబంధు లేదు.. కరెంటు ఉండదు.. పింఛన్ ఇయ్యరు.. ఆడపిల్లల పెండ్లిళ్లకు పైసలు రావు.. తాగడానికి నీళ్లు సరిగా సరఫరా చేయరు.. పాణం మంచిగ లేకపోతే చూసేటోళ్లు ఉండరు. చేసేది లేక ఆదిలాబాద్ రిమ్స్ దవాఖానకు వస్తున్నాం. సర్కారు పథకాల కోసం ఎన్ని దరఖాస్తులు పెట్టినా ఫలితం లేదు. ప్రజాప్రతినిధులు ఎన్నికలప్పుడు మాత్రమే వస్తరు. సమస్యల గురించి పట్టించుకోరు. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు అన్ని రకాల సాయం అందిస్తుండటంతో పంటలు బాగా పండుతున్నాయి. దీంతో మేము ఏటా పత్తి సీజన్‌లో ఉపాధి కోసం ఆదిలాబాద్ జిల్లాకు వస్తం. మూడు నెలలపాటు కూలి పనులు చేసుకొని ఉపాధి పొందుతాం. యాసంగిలో పల్లిలు తీయడానికి వచ్చి నెల రోజులు ఇక్కడే పనులు చేస్తాం. కుటుంబసభ్యులతో కలిసి వచ్చి ఇక్కడ ఉంటాం. రైతులు నివాస సౌకర్యం కల్పిస్తారు. మా దగ్గర వ్యవసాయ పనులకు వెళ్తే రోజుకు రూ.200 మాత్రమే కూలి ఇస్తారు. తెలంగాణలో అయితే.. రోజుకు రూ.400 నుంచి రూ.500 కూలి దొరుకుతది. భార్యాభర్తలం పనిచేస్తే రూ.800 నుంచి రూ.1000 వరకు గిట్టుబాటు అవుతది. మూడు నెలల్లో ఇద్దరం కలిసి రూ.50 వేల వరకు సంపాదిస్తాం. మేము తెలంగాణలో ఉంటే స్థానికుల లాగా సంతోషంగా జీవించేవాళ్లం. మా కష్టాలు దూరం కావాలంటే తెలంగాణలో ఉంటేనే సాధ్యమవుతది. మాకు ఆదిలాబాద్ జిల్లాలో నివసించే అవకాశం కల్పించాలి' అని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మాండ్వీకి చెందిన కూలీలు కోరుతున్నారు.

## • అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలి



మంత్రి, పాలకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం వేకువజామున తొర్రూరు పట్టణంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. తొర్రూరు అభివృద్ధికి తాను చేసిన పనులను వివరిస్తూ మరోసారి తనను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. అమ్మాపురం క్రాస్ రోడ్డులోని టీస్టాల్ వద్ద స్వయంగా టీ తయారు చేసి తనతో వచ్చిన వారితోపాటు వాకర్స్, సామాన్యులకు టీ అందజేశారు. -తొర్రూరు

# కాంగ్రెస్‌ది పెట్టే గుణం కాదు

- తెలంగాణతో ఆ పార్టీది అధికార బంధమే
- మేమెప్పుడూ ప్రజలతోనే ఉన్నాం, ఇకపైనా ఉంటాం
- మీ ఇంట్లో లైట్ వెలిగితే.. బీఆర్ఎస్‌కు ఓటువేయండి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ కవిత



జగిత్యాల జిల్లా పెగడపల్లి రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల/పెద్దపల్లి/జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ ప్రజలతో కాంగ్రెస్ పార్టీకి ఉన్నది కేవలం అధికార బంధం మాత్రమే. బీఆర్ఎస్‌కు ప్రజలతో ఉన్నది పేగుబంధం' అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఆమె ఆదివారం రోడ్‌షో నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో, రాత్రి పెద్దపల్లి జిల్లా మంథని నియోజక వర్గంలోని రామగిరి మండలం సెంటినరీ కాలనీ వాణీ విద్యానికేతన్ క్రీడా మైదానంలో ప్రజా ఆశీర్వాద సభల్లో ప్రసంగించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు 55 ఏండ్లు అవకాశమిస్తే ఏం చేశారని ప్రశ్నించారు. వృద్ధాప్య పెన్షన్ రూ.200 ఇచ్చారని, రైతులకు పెట్టుబడి సాయం కింద ఏనాడు పైసా ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీది ప్రజలకు పెట్టే గుణం కాదని, వారిది అధికార కాంక్ష మాత్రమేనని వ్యాఖ్యానించారు. తెలంగాణను సీఎం కేసీఆర్ అన్నిరకాలుగా అభివృద్ధి చేసి దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని చెప్పారు. తెలంగాణలో అమలవుతున్నన్ని సంక్షేమ పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాల్లో ఎక్కడా లేవన్నారు. ఒకప్పుడు రాష్ట్రంలో పాఠశాలలే సరిగా లేవని, ఇప్పుడు అనేక గురుకుల పాఠశాలలు ఏర్పాటయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు కరెంటు కోతలతో చాలా ఇబ్బంది పడ్డారని, ఇప్పుడు 24గంటల నాణ్యమైన కరెంటును అందిస్తున్నామని చెప్పారు. 'మీ ఇంట్లో స్విచ్ వేయగానే బుగ్గ వెలిగితే.. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మంథని నియోజక వర్గంలో గత ఐదేండ్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. 'నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలపై శ్రీధర్‌బాబును కలిసేందుకు వెళ్తే సర్కారు మాది కాదు నేను ఏ పని చేయలేను అ చెప్పే వాడు. అలాంటప్పుడు అతడికి ఓటు ఎందుకు వేయాలి' అని ప్రశ్నించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని, జడ్పీ చైర్‌పర్సన్లు దావ వసంత, జక్కు శ్రీహర్షిణి రాకేశ్, మాజీ మంత్రి రాజేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్కడ సేవ చేయనోళ్లు.. ఇక్కడ చేస్తారా?

- ప్రచారంలో స్పీకర్ పోచారం
- కాంగ్రెస్ అభ్యర్థి రవీందర్‌రెడ్డిపై ఫైర్

నస్రుల్లాబాద్, నవంబర్ 19 : 'సొంత నియోజకవర్గంలో సేవ చేయని నాయకులు ఇక్కడకు వచ్చి మనకు మంచి చేస్తారా?' అని బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి వలస వచ్చారని, అక్కడ అభివృద్ధి చేయని ఆయన, ఇక్కడేం చేస్తారని ప్రశ్నించారు. ఆదివారం కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో పోచారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1994లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు కనిపించిన స్పందన మళ్లీ ఇప్పుడు కనిపిస్తున్నదని అన్నారు. అసైన్డ్ భూములపై నియంత్రణ ఎత్తివేసి క్రయ, విక్రయాలకు వీలు కల్పిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే దమ్మున్న, సమర్థుడైన కేసీఆర్ లాంటి ముఖ్యమంత్రి ఉండాలని సూచించారు. 2018 ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీచేసిన తొమ్మిది మందిలో ఏనుగు రవీందర్ రెడ్డి ఒక్కడే ఓడిపోయాడని తెలిపారు. ప్రజలకు సేవ చేయకపోవడంతోనే అక్కడి ప్రజలు చిత్తుగా ఓడించినట్టు చెప్పారు. ఎల్లారెడ్డిలో చెల్లని రూపాయి బాన్సువాడలో చెల్లుతుందా? ప్రజలు ఆలోచించాలని కోరారు. ప్రచారంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నస్రుల్లాబాద్ మండలం మైలారంలో ప్రచారం నిర్వహిస్తున్న స్పీకర్ పోచారం



కరీంనగర్‌లో మాట్లాడుతున్న మంత్రి గంగుల. చిత్రంలో బోయినపల్లి వినోద్‌కుమార్

# అవినీతి బండికి బుద్ధిచెప్పాలి

- స్మార్ట్‌సిటీ తెచ్చానని గుడిలో ప్రమాణం చేస్తవా?
- సంజయ్‌కి మంత్రి గంగుల సవాల్

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 19: అవినీతికి పాల్పడుతున్నాడని బీజేపీ అధిష్ఠానం బండి సంజయ్‌ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించిందని, అలాంటి బండికి ప్రజలు ఓటుతో బుద్ధిచెప్పాలని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్ మండలంలోని నగునూర్‌తోపాటు నగరంలోని పలు డివిజన్లలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి ప్రచారం చేశారు. గంగుల మాట్లాడుతూ.. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తర్వాత ప్రజల ముఖం చూడలేదని ఆరోపించారు. ప్రజలను ఓట్లు అడిగే అర్హత లేక ప్రలోభాలతో ఓట్లు దండుకోవాలని చూస్తున్నాడని దుయ్యబట్టారు. నాలుగున్నరేండ్లలో సంపాదించిన అవినీతి సొమ్ముతో ఓటుకు రూ.20 వేలు, సెల్‌ఫోన్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. గెలిచిన తర్వాత ప్రజలను పట్టించుకోని నాయకులను తరిమికొట్టాలని సూచించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలకు కారణమైన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఎన్నికల్లో గెలిస్తే అమరవీరులకు పింఛన్ ఇస్తామనడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు.

# మేం మోసపోయాం.. మీరు జాగ్రత్త

- కాంగ్రెస్ గెలిస్తే వ్యవసాయం కుదేలు
- కేసీఆర్‌తోనే మేలన్న కర్ణాటక రైతులు
- బీఆర్ఎస్ మళ్లీ రావాలని ర్యాలీ
- కర్షకులపై కాంగ్రెస్ నేతల జులుం



ఆదివారం మక్తల్ నియోజకవర్గంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న కర్ణాటక రైతులు

ఊట్కూర్/కృష్ణ/మాగనూరు/నారాయణపేట రూరల్, నవంబర్ 19: 'కర్ణాటకలో కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసింది. ఇక్కడ (తెలంగాణలో) కూడా మోసం చేయాలని చూస్తున్నది. వారి గ్యారెంటీలను నమ్మి మేం మోసపోయాం. మీరు జాగ్రత్తగా ఉండాలి' అని కర్ణాటక రాష్ట్రం దేవసూగూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు రైతులు తెలంగాణ ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. కర్ణాటకకు చెందిన 'పరిసర ప్రేమ' రైతు సంఘానికి చెందిన దాదాపు 500 మంది రైతులు ట్రాక్టర్లు, బైక్‌లపై ఉదయం 11 గంటలకు నారాయణపేట జిల్లా కృష్ణ మండలం వాసునగర్ బార్డర్ చెక్‌పోస్ట్ వద్ద తెలంగాణలోకి ప్రవేశించారు. మరో పది రోజుల్లో తెలంగాణలో జరుగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేసి కేసీఆర్‌ను సీఎంగా గెలిపించుకోవాలంటూ ప్రజలను చైతన్యం చేశారు. కర్ణాటక రైతులు మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణ, మాగనూర్, మక్తల్, ఊట్కూర్ మండలాల మీదుగా నారాయణపేట జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. మార్గమధ్యంలో గుడెబల్లూరులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి, మక్తల్ పడమటి ఆంజనేయస్వామి, మాగనూర్ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయాలతోపాటు కొల్లంపల్లి కతాల్‌సాబ్ దర్గాను రైతులు దర్శించుకున్నారు. తెలంగాణకు తిరిగి కేసీఆర్ సీఎం కావాలన్న లక్ష్యంతోనే తాము స్వచ్ఛందంగా ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు. కాగా.. కర్ణాటక రాష్ట్రం దేవసూగూర్ పరిసర గ్రామాల నుంచి తెలంగాణలోకి వస్తున్న రైతులపై మక్తల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జులుం ప్రదర్శించారు. రైతుల వాహన ర్యాలీకి అడుగడుగునా ఆటంకం సృష్టించారు. కృష్ణ మండలంలోని టైరోడ్డు, మాగనూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులతో వాగ్వాదానికి దిగారు. కర్ణాటకలో కరెంటు సమస్య ఉన్నది తమకు కూడా తెలుసని, అక్కడ సమస్య ఉంటే అక్కడే ఉండి ధర్నాలు చేసుకోండని ఉచిత సలహాలు ఇచ్చారు. మెడలో గులాబీ కండువాలు వేసుకుని ప్రజలను చైతన్యం చేస్తామంటే ఒప్పుకునేది లేదంటూ వితండవాదానికి దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి జోక్యం చేసుకోవడంతో కర్ణాటక రైతులు తమ వాహన ర్యాలీతో ముందుకు కదిలారు.